క్లుప్తంగా

శాకంబరిగా మైసమ్మ



పెనుగంచిప్రోలు: స్థానిక మునేరు కాజ్‌వే పక్కన ఉన్న శ్రీ మైసమ్మ అమ్మవారు శ్రావణమాసం సందర్భంగా శాకంబరి అలంకారంలో దర్శనమిచ్చారు. పలు కూరగాయలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో శ్రావణ మాసోత్సవాలు



జగ్గయ్యపేట అర్బన్: శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో గురువారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీముత్యాలమ్మ ఆలయంలో అర్చకులు మార్తి సాంబశివశాస్త్రి పర్యవేక్షణలో అమ్మవారిని శ్రీకనకదుర్గమ్మగా అలంకరించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ గౌరవ సలహాదారు యర్రా శ్రీనివాసరావు, అధ్యక్ష, కార్యదర్శులు అప్పన మణికుమార్, కొత్తా రమేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు నోముల శివ కుమార్, సంయుక్త కార్యదర్శి, కోశాధికారులు కొంకిమళ్ల సురేష్, అప్పన పిచ్చయ్య, కమిటీ సభ్యులు నాగేంద్రం, ఆరేపల్లి వెంకటేశ్వర్లు, చేడే శ్రీరంగం, నాగప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత




గండేపల్లి(కంచికచర్ల): ప్రమాదవశాత్తు, మరణించినా, సహజ మరణం సంభవించినా ప్రభుత్వం మృతుల కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటుందని సర్పంచి బొక్కా రవి కుమార్ పేర్కొన్నారు. మండలంలోని గండేపల్లిలో ఇటీవల గుండెపోటుతో మరణించిన కుటుంబసభ్యులకు వైఎస్సార్ బీమా పథకం ద్వారా మట్టిఖర్చుల కింద మంజూరైన రూ.10 వేల నగదును గురువారం అందజేశారు. సర్పంచి మాట్లాడుతూ గ్రామస్తుడు తలమాల జోజి సైకిల్‌పై చిరు వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వ్యాపారం చేసే సమయంలో గుండె నొప్పితో అక్కడికక్కడే కూలిపోయాడు. గమనించిన స్థానికులు వైద్య చికిత్స కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతునికి భార్య మేరికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా మట్టి ఖర్చులకు మంజూరైన నగదును అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచి బెల్లంకొండ వెంకట సబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు సంగం దేవరాజు, తలమాల కిషోర్‌బాబు, పిల్లి ఆరోగ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావేదిక వాయిదా

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరగనున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక వాయిదా పడినట్లు ఎంపీడీవో ప్రసాద్ గురువారం తెలిపారు. అనివార్య కారణాలతో ప్రజావేదిక వాయిదా పడిందని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎప్పుడు నిర్వహిస్తామో చెబుతామని చెప్పారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



కంచికచర్ల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం దీక్ష డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ షేక్ రజీమ్ మధ్యాహ్న భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రైవేటు కళాశాల యాజమాన్యం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులపై అభిమానంతో 100 ప్లేట్లు అందజేయడం అభినందనీయమన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు అర్థమయ్యేలా డిజిటల్ క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు విరాళం

చంద్రాల(మైలవరం): మైలవరం మండలం చంద్రాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి దాతలు కాపవరపు వీరాస్వామి, వెంకటసుబ్బమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు కె.నారాయణరావు రూ.లక్ష విరాళంగా అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు వరదా శ్రీనివాసరావు గురువారం తెలిపారు. నారాయణరావు ఎస్ఏ(ఇంగ్లిష్ జెడ్పీహెచ్ స్కూల్), ఏలూరు జిల్లా ముసునూరు మండలం, వేల్పుచర్ల వాస్తవ్యులు. ఈ నగదుపై వచ్చే వడ్డీని పాఠశాలలో 10వ తరగతి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించినవారికి రూ.2,500, 2,000, 1,500 బహుమతిగా ఇవ్వనున్నారు.

సాగునీరు పుష్కలం



మునేరులో వరద నీరు



మునేరు ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న నీరు



నిండుకుండలా నవాబుపేట చెరువు

సాగునీరు పుష్కలంగా ఉండటంతో రైతులు ఈఏడాది ఉత్సాహంగా వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. ఇటీవల కురుస్తున్న వానల కారణంగా చెరువులు, కాలువలు నిండుకుండల్లా కనిపిస్తున్నాయి. చెరువులు నిండి అలుగుల్లోకి నీరు చేరుతోంది. వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలకు అధికంగా సాగునీరు ఇచ్చే మునేరు, మునేరు ప్రధాన కాలువల్లో కూడా నీరు పుష్కలంగా వస్తుండటంతో ఆయకట్టు రైతులు రెట్టింపు ఉత్సాహంతో సాగు చేస్తున్నారు. సాగునీటి ఇబ్బందులు లేవని, ప్రకృతి కరుణిస్తే అధిక దిగుబడులు సాధిస్తామని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. - పెనుగంచిప్రోలు

తప్పుల్లేని ఓటరు జాబితా సిద్ధం చేయాలి



వెరిఫికేషన్ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

నందిగామ: పట్టణ పరిధిలో తప్పుల్లేని ఓటరు జాబితా తయారుచేయడమే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్, ఏఈఆర్ఓ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణ పరిధిలోని పలు పోలింగ్‌స్టేషన్ల పరిధిలో గురువారం తొలగించిన, బదిలీ అయిన ఓట్లకు సంబంధించి వెరిఫికేషన్ చేశారు. పలు ఇళ్లకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ తొలగింపులు, బదిలీ అయిన ఓట్లు, మార్పులు, చేర్పులకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట బీఎల్వోలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మునేరుకు వరద నీరు



పెనుగంచిప్రోలు కాజ్‌వే వద్ద మునేరు ప్రవాహం

పెనుగంచిప్రోలు/లింగాల(వత్సవాయి): అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. మునేరుకు ఎగువన ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గురువారం మునేరుకు వరద నీరు వచ్చి చేరింది. గురువారం 8.1 అడుగుల మేర వరదనీరు వస్తున్నట్లు ఇరిగేషన్ అధికారి రామనరసింహారావు తెలిపారు. 2847 క్యూసెక్కుల వరద రాగా 2535 క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వరద నిలకడగా ఉన్నట్లు చెప్పారు. లింగాల కాజ్‌వే వద్ద వరదను దృష్టిలో ఉంచుకుని కాపలా పెట్టామని తహసీల్దార్ వైకుంఠరావు తెలిపారు.

వైరాలో..

నందిగామ: వైరా నదిలో వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు మంగళవారం రాత్రి నుంచి వైరా నదికి నీటి తాకిడి ప్రారంభమైంది. బుధవారం వరద ఉధృతి మరింత పెరిగింది. దీంతో నందిగామ మండలం దాములూరు కూడలి వద్ద కాజ్‌వేపై సుమారు మూడు అడుగుల నీరు ప్రవహించింది. ఈ నేపథ్యంలో నందిగామ, వీరులపాడు మండలాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గురువారం సాయంత్రానికి వరద ఉధృతి తగ్గింది. వరద నీరు తగ్గేవరకు ఆ మార్గం ద్వారా రాకపోకలు నిలిపివేసినట్లు ఆర్డీవో రవీంద్రరావు తెలిపారు.

తండ్రికి అంత్యక్రియలు చేసిన కుమార్తె

బీజేపీ నేత సత్యం మృతి



అంత్యక్రియలు చేస్తున్న కుమార్తె సావిత్రి

జగ్గయ్యపేట అర్బన్: బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొప్పు సత్యనారాయణ(55) మృతి చెందాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన గురువారం ఉదయం మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. పార్టీ పట్టణ సీనియర్ నాయకుడు కీసర రాంబాబు, హిందూ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పిన్నం వెంగళరావు, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మన్నె శ్రీనివాసరావు, రూరల్ మండల అధ్యక్షుడు చేవూరి వెంకటాచారి తదితరులు ఆయనకు నివాళులర్పించారు.

- కొప్పు సత్యంకు కుమారులు లేకపోవడంతో ఆయన కూతురు బండ్లమూడి సావిత్రి తండ్రికి అంత్యక్రియలు చేశారు. పెళ్లయి కొత్తగూడెంలో ఉంటున్న ఆమె వచ్చి తండ్రికి తల కొరివి పెట్టి పితృ రుణం తీర్చుకున్నారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



స్వర్ణ కిరీటంతో దర్శనమిస్తున్న శ్రీకృష్ణ ప్రార్థనా మందిరంలోని శ్రీకృష్ణభగవానుడు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పలు వైష్ణవాలయాల్లో తెల్లవారుజాము నుంచి స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాలునికి ప్రత్యేక అలంకరణ గావించారు. వైఖానాసాగమానుసారం చాలా వైష్ణవాలయాల్లో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. శేషయ్య వీధిలోని శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరంలో కొలువై ఉన్న శ్రీ కృష్ణభగవానునికి స్వర్ణకిరీట ధారణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు సమర్పించిన కానుకలతో సుమారు రూ.18 లక్షల వ్యయంతో స్వర్ణకిరీటాన్ని తయారు చేసి స్వామి వారికి ధరింపజేశారు. స్వామి వారి జయంతిని పురస్కరించుకొని స్వామి వారికి ఉదయం తిరుమంజన అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తులసీదళార్చన చేశారు. సాయంత్రం సామూహిక భగవద్గీత పారాయణం నిర్వహించారు. కార్యక్రమాన్ని అధ్యక్ష, కార్యదర్శులు గోకవరపు మురళీకృష్ణ, గుడిపాటి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఉదయం చిన్నికృష్ణుని ఉత్సవమూర్తికి విశేష తిరుమంజన నిర్వహించారు. అర్చకస్వాములు పొన్నంగిపల్లి రామచంద్రమూర్తి స్వామి వారికి తిరుమంజన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీక్షిత్, ముకుంద తదితరులు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్‌లో వేంచేసి ఉన్న వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి పలు విశేష అర్చనలు నిర్వహించారు. మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకారం చేశారు.ఉభయదేవరులతో కూడిన స్వామి వార్లకు పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం (కొత్తగుళ్లు) ప్రాంగణంలోని కోదండరామాలయంలో రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ భగవానుడికి విశేష తిరుమంజనాన్ని నిర్వహించారు. ఆలయంలో వేంచేసి ఉన్న ఉత్సవమూర్తులకు పంచామృతాలు, వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమాలను ఆలయ అర్చకస్వాములు పులిపాక రాఘవాచార్యులు, పులిపాక ఆంజనేయాచార్యులు తదితరులు నిర్వహించారు. శేషయ్యవీధిలోని పాండురంగస్వామి దేవస్థానంలో వేంచేసి ఉన్న సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. భజన మండలి ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేక ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ అర్చకులు అద్దేపలి మురళీకృష్ణ నిర్వహించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

జుజ్జూరు(వీరులపాడు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ రమావత్ కోటి పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామ సచివాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ 22 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని రీతిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పసుపులేటి సాయిబాబు, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, వైస్ ఎంపీపీ షేక్ నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు 'యాత్ర'

జగ్గయ్యపేట అర్బన్: విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంఘర్షణ సైకిల్ యాత్ర చేపట్టామని సంఘ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు ఎస్.సోమేశ్వరరావు తెలిపారు. పట్టణంలో గురువారం ఎస్ఎఫ్ఐ సంఘర్షణ సైకిల్ యాత్రను ఐద్వా జిల్లా నాయకురాలు సోమోజు నాగమణి ప్రారంభించారు. జగ్గయ్యపేటలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్, ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్, చిల్లకల్లు, గౌరవరం గ్రామాల్లోని జిల్లా పరిషత్ హైస్కూళ్లను సంఘర్షణ సైకిల్ యాత్ర ద్వారా సందర్శించి విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 16న విజయవాడలో యాత్ర ముగుస్తుందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.గోపీనాయక్, జిల్లా ఉపాధ్యక్షులు కుమార్‌నాయక్, మన్మధ,జిల్లా నాయకులు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ పాఠశాలలో మెరక పనులు



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల వలన కేతనకొండ ఎంపీపీ పాఠశాల ఆవరణ బురదమయంగా మారింది. దీంతో విద్యార్థులకు ఇబ్బందిగా మారడంతో పాఠశాల ఉర్దూ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషా మండల కో ఆప్షన్ సభ్యుడు పఠాన్ నాగుల్ మీరా దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన నాగుల్‌మీరా లారీతో డస్ట్ తోలించి మెరక చేయించారు. తాను చదువుకున్న పాఠశాలలో మెరక పనులు చేయడం ఆనందాన్ని కలిగించిందన్నారు. హెచ్ఎం నాగమల్లీశ్వరి, ఉపాధ్యాయులు నాగుల్‌మీరాను అభినందించారు.

15 లోపు ఈ-క్రాప్‌తోపాటు ఈకేవైసీ చేయించుకోండి

కంచికచర్ల: ప్రతి ఒక్కరూ ఈ నెల 15వ తేదీలోపు ఈక్రాప్‌తోపాటు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి విజయకుమార్ చెప్పారు. స్థానిక ఏఓ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు రైతుభరోసా కేంద్రాల్లో పంటల సాగు వివరాలు తెలియజేస్తూ ఈ- క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. పెసర, పత్తి, మొక్కజొన్న, నువ్వులు, మిర్చి, వరి, కంది పంటలతో పాటు ఏ ఇతర పంటలైనా ఈ-క్రాప్ చేయించుకోవాలన్నారు. ఇలా నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు మంజూరవుతాయని తెలిపారు. వైఎస్సార్ పంటల బీమా పథకం, సున్నా వడ్డీ, పంట రుణాలు, కొనుగోలు కేంద్రాల్లో పంటలను ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవచ్చని వివరించారు. ఈ-క్రాప్ నమోదు చేయించుకునేందుకు ఈనెల 15వ తేదీలోగా గడువు మాత్రమే ఉందని, ఈకేవైసీ కూడా చేయించుకోవాలని ఏఓ చెప్పారు.

వీరులపాడు: రైతులు సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా 15వ తేదీ లోపు ఈక్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి జోగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పెసర, పత్తి, మొక్కజొన్న, నువ్వులు, మిర్చి, వరి, కంది, తదతర పంటలకు విధిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని చెప్పారు.

ఉత్తమ అధ్యాపకుడు నరసింహారావుకు సత్కారం



నరసింహారావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ అహ్మద్, కళాశాల సిబ్బంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఉత్తమ అధ్యాపక పురస్కారం అందుకున్న జి.నరసింహారావుకు విద్యాధరపురం కబేళా సమీపంలోని ఉర్దూ ప్రభుత్వ కళాశాలలో గురువారం అభినందన సత్కారం చేశారు. ఉర్దూ కళాశాల ప్రిన్సిపాల్ హఫీజ్ షేక్ అహ్మద్, సిబ్బంది కలిసి నరసింహారావుకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హఫీజ్ షేక్ అహ్మద్ మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ఉత్తమ అధ్యాపక పురస్కారం పొందిన నరసింహారావు అభినందనీయులన్నారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల ఎస్వీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న ఆయన డెప్యుటేషన్‌పై ఉర్దూ ప్రభుత్వ కళాశాలకు వచ్చారని తెలిపారు. రెండు దశాబ్దాలుగా అధ్యాపకుడిగా పని చేస్తూ ఎందరో విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దారన్నారు. గౌరవప్రదమైన అధ్యాపక వృత్తిలో ఉంటూ అంకితభావం, చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించడమే నరసింహారావు ఉత్తమ అధ్యాపక పురస్కారం పొందడానికి నిదర్శనమని తెలిపారు. సమాజానికి ఉత్తమ పౌరులను అందించడంలో గురువుల పాత్ర కీలకమని అన్నారు. తమ వద్ద విద్యను అభ్యసించిన విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకున్నప్పుడు ఆ గురువు పొందే ఆనందం అంతా ఇంతా కాదన్నారు. పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రుల తరువాత అంతకు మించి కష్టపడేది గురువులేనని చెప్పారు. భవిష్యత్‌లో నరసింహారావు మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

దుర్గగుడిపై యాగశాలకు శంకుస్థాపన



యాగశాల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నూతన యాగశాల, మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నూతన ధ్వజస్తంభం ఏర్పాటు పనులకు గురువారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నూతన యాగశాలకు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ శంకుస్థాపన చేసి, పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ తూర్పు నియోజక వర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ దంపతులు హాజరయ్యారు. అంతకు ముందు చైర్మన్, ఈవోలతో పాటు పాలక మండలి సభ్యులు మల్లేశ్వర స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. దేవస్థానం చేపట్టిన పనులు దిగ్విజయంగా పూర్తి కావాలని స్వామి వారిని వేడుకున్నారు. కార్యక్రమంలో డీఈవో గురు ప్రసాద్, పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, చింకా శ్రీనివాసరావు, నంబూరి రవి, చింతా సింహచలం, బచ్చు మాధవీకృష్ణ, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్. రమతో పాటు యాగశాల నిర్మాణదాత నరసింహారావు, ఆలయ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. దాతల నిర్మాణ సహకారంతో ఆయా పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు.

దసరా అలంకారాలపై చైర్మన్‌తో చర్చ

దసరా ఉత్సవాల్లో అమ్మవారికి చేసే విశేష అలంకారాలపై దుర్గగుడి ఈవో భ్రమరాంబ, వైదిక కమిటీ సభ్యులు శంకరశాండిల్యులు గురువారం చైర్మన్ కర్నాటి రాంబాబు చర్చించారు. ఈ ఏడాది అధిక శ్రావణం, తిథుల హెచ్చుతగ్గుల కారణంగా అలంకరణలలో చోటు చేసుకున్న మార్పుల గురించి చర్చించారు. ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో తొలి రోజున స్వర్ణకవచాలంకృత దుర్గాదేవి అలంకారం చేయకపోవడానికి గల కారణాలను వైదిక కమిటీ, ఈవోలను చైర్మన్ రాంబాబు అడిగి తెలుసుకున్నారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న బ్రహ్మాజీరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రకృతి పరిరక్షణ కోసం అందరూ పాటుపడాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ విభాగాధిపతి ఆచార్య పి.బ్రహ్మాజీరావు అన్నారు. కేబీఎన్ కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాల ఆధ్వర్యంలో నీలి ఆకాశం కోసం అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి దినోత్సవం సందర్భంగా 'స్వచ్ఛమైన గాలి కోసం అందరం' అంశంపై సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీరావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న సాంకేతిక ప్రగతి పర్యావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు. ప్రకృతిలో కీలకమైన గాలి నాణ్యత రోజురోజుకు దిగజారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వాయు కాలుష్యం పెరుగుతుండటంతో మానవుల ఊపిరితిత్తుల ఆరోగ్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. కేవలం మానవులకే కాకుండా సమస్త జీవరాశి గాలికాలుష్యంతో ప్రమాదంలో పడిందన్నారు. వాయు కాలుష్యాన్ని వీలైనంత వరకూ తగ్గించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మారుతున్న కాలానుగుణంగా వస్తున్న పరిస్థితులను విద్యార్థులు గమనిస్తూ ప్రకృతిలో జరిగే కాలుష్యాన్ని నివారించేందుకు పాటుపడాలని సూచించారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి విజయవాడ రీజనల్ ఆఫీసర్ ఎస్. విజయసారథి మాట్లాడుతూ విద్యార్థులు కాలుష్యాన్ని నివారించేందుకు పాటుపడాలని సూచించారు. ముఖ్యంగా కాలుష్య నివారణకు సంబంధించి నూతన ఆవిష్కరణలు తీసుకురావాలన్నారు. కార్యక్రమానికి కళాశాల డాక్టర్ వి.నారాయణరావు అధ్యక్షత వహించారు. విభాగాధిపతి సీహెచ్ నాగభూషణం, అధ్యాపకులు ఆర్.ఉదయ్‌కుమార్, ఏహెచ్‌డీ ప్రకాష్, జి.హేమలత తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ, భక్తి సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: శ్రీసాయిలాహరి లాహిరిలో సరిగమల సప్త స్వరాలు సంస్థ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా సీనియర్ గాయకుడు కేవీ రమణబాబు ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన సినీ, భక్తి సంగీత విభావరి మధురంగా సాగింది. రసూల్‌బాబు, ఆదిరాల జయప్రభ, కృష్ణకుమారి, సువర్ణలక్ష్మి తదితరులు ఆలపించారు.

నేటి నుంచి ఉరుసు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): స్వాతి సెంటర్‌లోని బాబాజీ హజరత్ సయ్యద్ అమీనుద్దీన్ చిష్తి ఔలియా దర్గా 39వ ఉరుసు (గంధం) మహోత్సవం ఈ నెల 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఖాజీ, దర్గా ముతవల్లి/అధ్యక్షుడు సయ్యద్ షా మొహమ్మద్ ఖాజా మొయినుద్దీన్ చిష్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పర్చం ఖుషాయ్ (ఉరుసు ప్రారంభోత్సవం) జరుగుతుందని పేర్కొన్నారు. రెండవ రోజు శనివారం సాయంత్రం 6 గంటలకు బాబా దర్గా నుంచి గంధంతో వాహనంలో ఊరేగింపుగా బయలుదేరి ప్రకాశం బ్యారేజీ, కాళేశ్వరరావు మార్కెట్ మీదుగా వించిపేటలో బాబా దేవుని ధ్యానం చేసిన ప్రదేశానికి (రైల్వే స్టేషన్ పడమర వైపు గల షాజహూర్ ముసాఫిర్ ఖానాలోని షాప్ నెంబర్ 9) వద్దకు చేరుకుంటుందని వివరించారు. తిరిగి అక్కడి నుంచి బయలుదేరి సొరంగం మీదుగా రాత్రి 9 గంటలకు భవానీపురం బాబా దర్గాకు చేరుకుంటుందని తెలిపారు.

యోగాసన పోటీల్లో సిద్ధార్థ విద్యార్థిని ప్రతిభ



జ్యోత్స్నదేవిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమేష్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కృష్ణాజిల్లా యోగాసన అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ సింగ్‌నగర్‌లో జరిగిన యోగాసన పోటీల్లో తమ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ చదువుతున్న గంటా జ్యోత్స్నదేవి ప్రతిభ చూపి మహిళల విభాగంలో కృష్ణా జిల్లా (ఉమ్మడి కృష్ణా జిల్లా) స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సొంతం చేసుకుందని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ అన్నారు. జ్యోత్స్నదేవిని గురువారం కళాశాలలో అభినందించారు. ఈ నెల 9, 10 తేదీల్లో కర్నూలులో జరుగుతున్న రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలకు ఆమె అర్హత సాధించడం ఆనందంగా ఉందన్నారు. యోగా శిక్షకురాలు శిరీష, సహాయ శిక్షకుడు సాయి చెన్నకేశవతో పాటుగా అధ్యాపకులు ఆమెను అభినందించారు.